ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు రామగుండం సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి నిర్వహించారు. ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్.ఐ. రమేష్ ఆధ్వర్యంలో నార్కోటిక్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.14,730లు నగదు, 6 సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న నగదును అంతర్గాం పోలీసులకు అప్పగించినట్లు, కేసు నమోదు చేయనున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

# కరీంనగర్ అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

### సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** కరీంనగర్‌లో అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం సుడా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి పనులన్నీ కేంద్రం నిధులతోనే జరుగుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. కరీంనగర్ లో జరుగుతున్న అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ 50 కోట్లతో మొత్తం నేషనల్ హౌసింగ్ బ్యాంక్ కు రుణం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని అందులో కేంద్ర ప్రభుత్వానివి ఒక్క రూపాయి కూడా లేదని స్పష్టం చేశారు. స్మార్ట్ సిటి బ్యాలన్స్ 140 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 70 కోట్లు జమ చేసిందని కేంద్రం మాత్రం మొండిచేయి చూపిందని అన్నారు. వీటిపై బండి సంజయ్ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం కేంద్రం నుంచి కరీంనగర్ అభివృద్ధికి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ కార్పోరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, జనగ్ రెడ్డి, నాయకులు పిట్టల రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బోల్తా పడిన 'బోలెరో'

### తృటిలో తప్పిన పెద్ద ప్రమాదం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** అతివేగం ఓ వాహనాన్ని అదుపు తప్పించి బోల్తా కొట్టించిన సంఘటన ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటన వివరాల్లోకి వెళ్లితే.. మహారాష్ట్ర వైపు నుంచి నిజామాబాద్ వైపు అరటి పండ్ల లోడ్‌తో వెళ్తున్న ఎంహెచ్26 సిహెచ్ 4052 నంబర్ గల బోలెరో వాహనం నవీపేట్ రోడ్డులోని జాన్కంపేట్ గ్రామ శివారుకు చేరుకోగానే అతివేగంతో ప్రయాణించింది. ఈ క్రమంలో అక్కడున్న మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డుపైనే ఫల్టీ కొట్టింది. వాహనం బోల్తా పడిన సమయంలో ఎలాంటి ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. వాహనం దెబ్బతిన్నప్పటికీ, డ్రైవర్ సమయస్ఫూర్తితో చాకచక్యంగా వ్యవహరించడంతో అతనికి ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డాడు.

## భీమన్నను దర్శించుకున్న హీరో అఖిల్ రాజ్

**ప్రజాపక్షం/వేములవాడ:** భీమేశ్వర స్వామివారిని 'రాజు వెడ్స్ రాంబాయి' మూవీ హీరో అఖిల్ రాజ్ శనివారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారుఅనంతరం శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు అఖిల్ రాజ్‌కు స్వామివారి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా హీరో అఖిల్ రాజ్ మాట్లాడుతూ. చిన్నప్పటి నుంచే వేములవాడ రాజన్న అంటే నాకు అమితమైన భక్తి అని అన్నారు. "తెలంగాణలో పుట్టిన ప్రతి ఒక్కరికీ వేములవాడ రాజన్న అంటే తెలియని వారు ఎవరూ ఉండరు. వేములవాడకు వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నాను. ఈసారి కూడా దర్శించుకుని స్వామివారికి అభిషేకం నిర్వహించి, కోడె మొక్కులు చెల్లించుకున్నాను అని తెలిపారు. వేములవాడ ఆలయంలో తనకు చక్కటి ఆతిథ్యం, దర్శన ఏర్పాట్లు కల్పించిన ఆలయ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "ఆలయ ఈవో కు వెరీ వెరీ థాంక్యూ. ఆలయాన్ని చాలా బాగా అభివృద్ధి చేస్తున్నారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. కొత్త సినిమాలతో బిజీగా అఖిల్ రాజ్ తన సినిమా గురించి మాట్లాడుతూ 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని అఖిల్ రాజ్ తెలిపారు. ప్రస్తుతం నటి అనుపమ పరమేశ్వరితో కలిసి 'క్రేజీ కళ్యాణం' సినిమాలో నటిస్తున్నట్లు వెల్లడించారు. వేములవాడ రాజన్న స్వామివారి ఆశీస్సులతో తనకు, తన సినిమాలకు మంచి విజయం లభించాలని కోరుకుంటున్నట్లు అఖిల్ రాజ్ తెలిపారు. స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులతో భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నానని పేర్కొన్నారు.



# ట్రినిటి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఘనంగా బోనాల వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** కరీంనగర్‌లోని ట్రినిటి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా బోనాల పండుగను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. కళాత్మకంగా తీర్చిదిద్దిన బోనాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపక చైర్మన్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని అన్నారు. విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 10న జైల్ భరోకు తరలిరండి!

**ప్రజాపక్షం/అంతర్గాం :** క్విట్ ఇండియా ఉద్యమ స్పూర్తితో ఈనెల 10న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో చేపట్టనున్న జైల్ భరో కార్యక్రమంలో పాల్గొనాలని ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేటలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో పీవైఎల్ గ్రామ కమిటి అధ్యక్షులు బండి అశోక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు, లేబర్ కోడ్‌లు, ఎఫ్‌టిఎ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ, రైతు సంక్షేమం, కార్మిక హక్కుల సాధనకై ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు దూలం సతీష్, ఈదునూరి బాబు, కోడిపుంజుల శ్రావణ్, బండి శ్రావణ్, బండి సతీష్, తూళ్ల సతీష్, తమ్మనవేని సతీష్, తమ్మనవేని రమేష్, పొనగంటి క్రాంతి కుమార్, ఈ.అంజి, బోయపోతు ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

## ఓబిసి మోర్చా ఇన్‌ఛార్జిగా కృష్ణ నియామకం

**ప్రజాపక్షం/గోదావరిఖని :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా ఇన్‌ఛార్జిగా గోదావరిఖని పట్టణానికి చెందిన నాయకుడు పిడుగు కృష్ణ ముదిరాజ్‌ను నియమించారు. ఈ మేరకు మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్ ఉత్తర్వు జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓబీసీలందరికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కృష్ణ తెలిపారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ 10వ తేదీన ధర్నా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** కార్మిక చట్టాలు హక్కులను పరిరక్షించుకోవడంలో భాగంగా ఆగస్టు 10 వ తేదీన దేశవ్యాప్తంగా ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందని సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ పేర్కొన్నారు. అమృత్ లాల్ శుక్లా కార్మిక భవన్ బి వై నగర్ , సిఐటియు జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆగస్టు 10వ తేదీ సోమవారం రోజున జిల్లాలోని అన్ని రంగాల కార్మికులతో సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి మహాధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇట్టి ర్యాలీ ధర్నా కార్యక్రమాలలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పవర్లూమ్ అనుబంధ రంగాల కార్మికులు, అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులందరూ కార్మిక చట్టాల హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి అన్నల్దాస్ గణేష్ జిల్లా నాయకులు సిరిమల్ల సత్యం, దాసరి రూప, సందుపట్ల పోచమల్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బురదమయంగా రోడ్లు.. దోమలతో రోగాల ముప్పు!



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామ పరిధిలోని గొల్లవాడలో రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ వార్డు ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ప్రస్తుతం గొల్లవాడలోని అంతర్గత రహదారి పూర్తిగా బురదమయంగా మారి,కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడింది. నిత్యం రాకపోకలు సాగించే రోడ్డు కాస్తా.. ప్రమాదకరంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రోడ్డుపై నిలిచిన బురద నీటి వల్ల దోమలు,కీటకాలు విపరీతంగా పెరిగిపోయాయని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని గొల్లవాడ వాసులు భయాందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా, తమ బాధను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు,సర్పంచ్, పాలకవర్గం తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గొల్లవాడలోని బురద రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని, అలాగే దోమల నివారణకు చర్యలు చేపట్టి తమ వార్డు ప్రజలను ఆరోగ్యాలను కాపాడాలని గొల్లవార్డు ప్రజలు కోరుతున్నారు.

## బ్లూబెల్స్ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** నగరంలోని హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ ఇన్నోవేటివ్ హైస్కూల్‌లో శనివారం బోనాల పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలు పండుగల విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో పాఠశాల ఆవరణలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ సంప్రదాయ దుస్తుల్లో పోతరాజుల వేషధారణ, శివభక్తుల నృత్యాలు, డప్పుచప్పుళ్లు, తెలంగాణ జానపద పాటలు, నృత్యాలు,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్శణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ జంగ సునితా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి , సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయలను పండుగల విశిష్టతను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం బి. సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజులు మాట్లాడుతూ పండుగ విశిష్టతతోపాటు తెలంగాణ సంస్కృతి దాని ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి




**ప్రజాపక్షం / రామడుగు :** విద్యార్థులు విద్యతో పాటు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని శ్రీ ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ అన్నారు. శనివారం గోపాలరావుపేట పాఠశాలలో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు వాటి బాధ్యతల గురించి లీడర్షిప్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదుల్లో చదుకోవడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన, క్రమశిక్షణ సేవాభావాన్ని పెంపొందించి వారిని సమాజానికి ఉపయోగపడేవిధంగా తీర్తిదిద్దడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్స్, స్పోర్ట్స్ హెడ్, కల్చరల్ హెడ్ తదితర విభాగాలకు మొత్తం 12 మంది విద్యార్థులను నాయకులుగా ఎంపిక చేశారు. అనంతరం ఆషాడ మాసం సందర్భంగా విద్యార్థుల చేత బోనాల వేడుక ఘనంగా జరిపించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ధరించిన వేషాధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ మునిందర్, అకాడమిక్ ప్రిన్సిపల్ మనస్విని, డైరెక్టర్లు, ఇంఛార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్ విధానంతో పేదలకు తీవ్ర అన్యాయం

**ప్రజాపక్షం/చొప్పదండి :** కాంగ్రెస్ సర్కార్ కొత్త పెన్షన్ నిబంధనలు మార్పు చేయడంతోపాటు అర్హులందరికీ ఫించన్లు మంజూరు చేయాలని బిజేవైఎం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సంగ నరేశ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకంగా 70 సంవత్సరాలు నిండినవారికి మాత్రమే వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం అత్యంత దారుణమైన నిర్ణయమని అన్నారు. పెన్షన్ అర్హత వయస్సును 70 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు తగ్గించాలని అంతేకాకుండా వితంతు మహిళలకు 40 సంవత్సరాల వయో పరిమితి విధించడం కూడా పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన మహిళ ఏ వయసులో ఉన్నా ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందని అందువల్ల వితంతు పెన్షన్ కు ఏలాంటి వయో పరిమితి లేకుండా అర్హులైన ప్రతి మహిళకు పెన్షన అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన అర్హత నిబంధనలను కూడా పునః సమీక్షించి నిజమైన పేదలకు న్యాయం జరిగేలా తక్షణమే సవరణలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## సర్పంచ్ భర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/గంగాధర:** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నారాయణపూర్ గ్రామ సర్పంచ్ దీకొండ బాబాలక్ష్మీ భర్త దీకొండ మధును చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం పరామర్శించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం మధు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మధు త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. పరామర్శించినవారిలో రవిశంకర్‌తో పాటు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, వేముల దామోదర్ తదితరరులు ఉన్నారు.

## పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేకు సహకరించాలి

**ప్రజాపక్షం/జమ్మికుంట :** జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2026లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట పట్టణంలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కమీషనర్ గుట్టల మల్లిఖార్జున స్వామి, మేనేజర్ జి.రాజిరెడ్డి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుధగోని రామకృష్ణ గౌడ్ కార్యాలయాల్లో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు. దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయమైన గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో మొదటి దశలో కుటుందల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెల ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారి కూలీ పనులు పని చేసిన గంటలు, మహిళల ఆదాయం తదితర వివరాలను నమోదు చేసి గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజు గౌడ్, బిల్ కలెక్టర్ గుంటి సాయికృష్ణ, మెప్మా సెక్షన్ సిబ్బంది బండి రజిత, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు.. శిశు ఆరోగ్యానికి రక్ష..!

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గ్రామ సర్పంచి గాదె స్రవంతి సుధాకర్ పాల్గొని గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సున్నం విజయలక్ష్మి, ఆయా శంకరమ్మ, ఎఎన్ఎం సరిత, ఆశ కార్యకర్త ఉప్పులేటి రాజేశ్వరి, ఉపాధ్యాయురాలు సుంకె నర్సింగ్, గుర్రాల చంద్రకళ, శ్రీరాముల విజయ, భాగ్యలక్ష్మి , ఇంద్ర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాపక్షం/ముత్తారం: తమకు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆదేశాలను అమలు చేసి, న్యాయం చేయాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేషనపల్లి గ్రామానికి చెందిన జంగ రాజేశ్వరి స్వామి తో పాటు పిటిషనర్లు శుక్రవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. పత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. తెలంగాణ హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్ నంబర్ 19516/2026 పై విచారణ జరిపిన న్యాయస్థానం, గత జూన్ 23/2026న తుది తీర్పును వెలువరించింది. వివాదాస్పద భూమికి సంబంధించిన వ్యవహారంలో, అధికారులు ఎప్పుడు ఆదేశించినా సంబంధిత కార్యాలయం ముందు పిటిషనర్లు హాజరుకావాలని కోర్టు స్పష్టం చేస్తూనే, పిటిషన్‌ను పరిష్కరించింది. ఈ నేపథ్యంలో, హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల కోర్టు ఆర్డర్ కాపీలు ప్రకారం తదుపరి చర్యలు తీసుకుని, తమకు తగిన న్యా యం చేయాలని బాధితులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు హైకోర్టు తీర్పు ప్రతిని కూడా వినతిపత్రంతో పాటు అధికారులకు అందజేశారు.



# మోకాలి చికిత్సకు రూ.75వేల ఎల్‌ఒసి అందజేత

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన గుర్రం వరలక్ష్మి మోకాలి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు.ఆమె వైద్య ఖర్చుల సహాయం కోసం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సంప్రదించారు. బాధితురాలి పరిస్థితిపై మంత్రి తక్షణమే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.75,000 విలువైన ఎల్‌ఓసీ పత్రాన్ని మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆసుపత్రి సహాయకులు ఈ ఎల్‌ఓసీ పత్రాన్ని శనివారం వరలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపత్కాలంలో త్వరితంగా స్పందించి ఆర్థిక సహాయం అందించిన మంత్రి శ్రీధర్ బాబుకు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/ముస్తాబాద్: పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తతోపాటు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై జ్యోతి అన్నారు. శనివారం ముస్తాబాద్ రామలక్ష్మణ పల్లె గ్రామ శివారులోమైనర్ బాలుడు వాహనం డ్రైవ్ చేస్తుండగా గమనించి, వారిని కౌన్సిలింగ్ ఇచ్చారు, సరదా కోసం ద్విచక్ర లేదా ఇతర వాహనాలు నడిపితే ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీ జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి వాహనాలు ఇవ్వొద్దని ఎస్సై సూచించారు.

# నానో సాంకేతికతతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

## తక్కువ వ్యయం.. అధిక దిగుబడి!

ప్రజాపక్షం/నిర్మల్: కాలం మారుతున్న కొద్దీ వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం అనివార్యంగా మారింది. రోజురోజుకూ పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించుకుంటూ,మట్టి సారాన్ని పరిరక్షించుకోవడంతో పాటు గరిష్ఠ దిగుబడులను సాధించేందుకు నానో సాంకేతికత రైతులకు గొప్ప వరంగా మారుతోంది. రసాయన ఎరువుల అతివాడకం వల్ల నేల సాగు నీటి సామర్థ్యం క్షీణించడమే కాకుండా, రైతులపై ఆర్థిక భారం విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సాంప్రదాయ ఎరువుల స్థానంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన నానో యూరియా ప్లస్, నానో డీఏపీ ద్రవ ఎరువులు వ్యవసాయంలో సరికొత్త విప్లవాన్ని తీసుకువస్తున్నాయి. నిర్మల్ జిల్లా పరిధిలోని రైతులకు ఇవి ఎంతో లాభదాయకంగా మారాయి.

**నానో ఎరువుల వాడకం వల్ల దక్కే మేలు :** సాధారణంగా రైతులు పొలాల్లో చల్లే గుళికల రూపంలోని యూరియా, డీఏపీలలో మెజారిటీ భాగం ఆవిరైపోవడం లేదా నేలలో కలిసిపోవడం జరుగుతుంది. ప్రస్తుతం వాడకంలో ఉన్న సాంప్రదాయ ఎరువుల ద్వారా మొక్కకు అందుబాటులోకి వచ్చేది కేవలం 30 శాతం మాత్రమేనని వ్యవసాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మిగిలిన 70 శాతం ఎరువులు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తున్నాయి. దీనివల్ల దాదాపు 80 శాతానికి పైగా పోషకాలు మొక్కకు నేరుగా లభించి, పైరు ఆరోగ్యంగా పెరగడమే కాకుండా తెగుళ్లను తట్టుకునే శక్తిని సాధిస్తుంది.

**సాగు ఖర్చులు తగ్గి ఆర్థిక భారం నుంచి ఉపశమనం :** నానో ఎరువులు నాణ్యతలో మాత్రమే కాదు, ధర విషయంలోనూ రైతులకు ఎంతగానో లబ్ధి చేకూరుస్తున్నాయి. సాధారణంగా 1 లీటరు నానో యూరియా బాటిల్ సామర్థ్యం 45 కిలోల బరువుండే ఒక సాధారణ యూరియా బస్తాతో సమానం. ప్రభుత్వ రాయితీ పోనూ సాధారణ యూరియా బస్తా ధర రూ. 266 ఉండగా, నానో యూరియా ప్లస్ సీసా కేవలం రూ. 200 లకే అందుబాటులో ఉంటుంది.

# నల్లపోచమ్మ బోనాల వేడుకలు

ప్రజాపక్షం/రామగుండం : రామగుండం పట్టణ శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీమాత నల్ల పోచమ్మ బోనాల జాతరను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. దేవాలయానికి అనుకొని ఉన్న పోచమ్మ గుడిని ముస్తాబు చేశారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. తోరణాలు, విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి సమర్పించే నైవేద్యాలు, బోనాల ఊరేగింపు, ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకై ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శనం చేసేందుకు ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, విద్యుత్తు సదుపాయం కల్పించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో జాతర ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కమిటి సభ్యులు కోరారు.

# శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : నేటి తరం విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూనే తమ మూలాలను, సంప్రదాయాలను గౌరవించాలని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పల్లె రాజు రెడ్డి అన్నారు. శనివారం శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా రాజు రెడ్డి మాట్లాడారు. బోనాలు కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజల భక్తి, సంప్రదాయం, ఐక్యత, కృతజ్ఞతలకు ప్రతీక అన్నారు. ఆధునిక విద్యతో పాటు విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నామస్మరణతో మార్మోగిన సుల్తానాబాద్

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలో హృదయం పరవశించేలా శ్రీరామ నామంతో మార్మోగింది. పరమపూజ్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామివారి దివ్య సంకల్పంతో,ముచ్చింతల్‌లోని శ్రీరామానుజ సహస్రాబ్ది సమతా విగ్రహ క్షేత్రం నుంచి పంపిన శ్రీరామ హృదయ కలశానికి సుల్తానాబాద్‌లో భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం లభించింది. సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయం నుంచి గ్రంథాలయం, పాత జెండా చౌరస్తా, శివాలయం, మున్సిపల్ కార్యాలయ చౌరస్తా మీదుగా శ్రీరామ హృదయ కలశంతో నగర సంకీర్తన నిర్వహించారు.భక్తుల శ్రీరామ నామస్మరణ,భజనలు, భక్తి పాటలతో సుల్తానాబాద్ వీధులన్నీ ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగాయి. అనంతరం శ్రీరామ హృదయ కలశాన్ని ఇంటింటికీ తీసుకెళ్లగా మహిళలు, భక్తులు శ్రీరామ... శ్రీరామ.. అంటూ ఐదుసార్లు శ్రీరామ నామాన్ని జపించి బియ్యం గింజలను కలశంలో సమర్పించారు.కుటుంబ క్షేమం, సమాజ శాంతి, ప్రజల సౌభాగ్యం, ప్రకృతి వైపరీత్యాల నివారణ కోసం చిన్న జీయర్ స్వామివారు చేపట్టిన ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమానికి సుల్తానాబాద్ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత, జిల్లా ప్రతినిధులు జువ్వాడి భాస్కరరావు, సుజాత,రాజు,అర్చకులు వినయ్ త్రిపాఠి, బిట్టు, కొల్లూరి జనార్ధన్, రాము,ఎరవెల్లి శైలజ, బూరుగు సత్యం, పవన్, భక్తులు పాల్గొన్నారు.



# ఎల్లారెడ్డిపేట ఎస్ఐగా రమేష్‌గౌడ్ బాధ్యతలు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట పోలీసుస్టేషన్ కు నూతనంగా ఎస్ రమేష్‌గౌడ్ శనివారం బాధ్యత స్వీకరణ చేపట్టారు. శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు. ప్రజలు తమసమస్యలను నిర్భయంగా తెలుపాలని సూచించారు. పోలీసు శాఖ సమన్వయంతో శాంతియుత వాతవరణం నెలకొల్పేందుకు కృషిచేస్తామని చెప్పారు.

# ఆటో కార్మిక కుటుంబానికి ప్రమాదబీమా చెక్కు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: ఆటోకార్మిక సంక్షేమ సంఘానికి భారత రాష్ట్రసమితి అండగా నిలుస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకం ద్వారా మండలంలోని బొప్పాపురం కు చెందిన ఆటె కార్మికుడు ఇటీవల బొమ్మన వేణిరాజు ప్రమాదంలో మరణించగా అతని కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందించారు. వారికి ఐదులక్షల ప్రమాదబీమా చెక్కును మాజి జడ్పీటీసీ చీటిలక్ష్మణ్‌రావు, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు కృష్ణహరి చేతుల మీదుగా చెక్కును బీమా సహాయం మంజూరు అయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు అందె సుభాష్, కృష్ణారెడ్డి, సర్పంచ్ గీతాంజలి, కొండ రమేష్‌గౌడ్, వర్సకృష్ణహరి, ఆటో కార్మికులు వెంట ఉన్నారు.

# అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాపక్షం/రామగుండం : రామగుండం నగర పాలక 29వ డివిజన్‌లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఠాకూర్ అయోధ్యసింగ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలను తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వలక్ష్యమన్నారు. గత ముప్పై ఏళ్లుగా ఏలాంటి అభివృద్ధికి నోచుకొని రామగుండం పట్టణం నేడు రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్, నగరపాలక మేయర్ మహంకాళి స్వామి సహకారంతో వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 28వ, 29వ డివిజన్ల కార్పొరేటర్లు కుమార్, రజని రవి,హరిప్రసాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# మహిళల ప్రాణాల పట్ల అప్పిరియల్ పార్క్ యజమాన్యం నిర్లక్ష్యం



ప్రజాపక్షం/ముస్తాబాద్: ఆవునూర్ గ్రా మంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో అప్పిరియల్ పార్క్ లో పని చేసే మహిళలను నిబంధనలకు విరుద్ధంగా బస్సుల్లో 55 మంది కెపాసిటీ ఉండగా చుట్టూ ఉన్న గ్రామాల నుండి 150 మందిని ఒకే బస్సుల్లో తరలిస్తున్నారని అన్నారు. శనివారం ఉదయం బస్సును ఆపి హెచ్చరించారు. మహిళా ప్రాణాలతో అప్పిరియల్ పార్క్ యాజమాన్యం చెలగాటమాడుతుంది.గ్రామ పెద్దలు ఆరోపించారు .ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలని అదనపు బస్సులు కేటాయించి మహిళలు సురక్షితంగా చేరుకునేల చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్, బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నాల పద్మారెడ్డి, దాసరి విశ్వనాథ్,కుమ్మరి అంజయ్య కనమెని శ్రీనివాస్ రెడ్డి, బోయిని రవి, పిట్ల రాజు, నక్కదాసరి దేవరాజు, నక్కల సుధాకర్ రెడ్డి,నక్కల మస్కట్ మల్లారెడ్డి పిట్ల చంద్రయ్య, నరేష్,గంగాడి శ్రీనివాస్ రెడ్డి గ్రామ పెద్దలు ఉన్నారు.

# తెలంగాణ సాంప్రదాయానికి బోనాలు గోరింటాకు ఉత్సవాలు ప్రతీక

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : తెలంగాణ సాంప్రదాయానికి బోనాల ఉత్సవాలు గోరింటాకు సంబరాలు ప్రతీక అని శ్రీవాణి ఎద్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ రేకులపల్లి శశాంక అన్నారు.శనివారం సుల్తానాబాద్‌లోని శ్రీవాణి జూనియర్, డిగ్రీ, పిజి కళాశాలలో బోనాలు, గోరింటాకు సంబరాలు అంబరాన్నంటే ఎలా అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ గోరింటాకు సంబరాల్లో భాగంగా విద్యార్థినులు ఒకరి చేతికి ఒకరు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు.వివిధ రకాల ఆకృతుల తో చేతులను అలంకరించుకుని ఆనందంగా గడిపారు.బోనాలను అలంకరించి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీవాణి కళాశాల అధ్యాపక బృందంతో పాటు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

**ప్రజాపక్షం/రాయికల్:** భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి 1998-99 మరియు 2012-13 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు 30 వేల రూపాయలతో పాఠశాల ప్రధాన గేట్ ను ఏర్పాటు చేయడం జరిగింది. పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొని తమ చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకుంటూ తమ ఉన్నతికి తోడ్పడిన పాఠశాలను మరువకుండా పాఠశాల అభివృద్ధిలో తాము భాగమవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. అలాగే ప్రతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు రమణి,ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, సంజీవ్, వేణు,సురేష్,రాజగోపాల్,వంశీ మరియు పాఠశాల యాజమాన్య కమిటీ,తల్లిదండ్రులు,ప్రజాప్రతినిధులు అభినందించారు.

## జాతీయ ఉత్తమ ఫోటో జర్నలిస్ట్ అవార్డు గ్రహీతకు సన్మానం

**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి సీనియర్ పాత్రికేయులు, టీవీ5 నియోజకవర్గ ప్రతినిధి వడ్లూరి రవీందర్ ను శనివారం 1981వ స్సెస్సీ మిత్రబృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. కర్ణాటక మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల బెంగుళూరు నగరంలో నిర్వహించిన నేషనల్ న్యూస్ ఫోటో జర్నలిస్ట్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్ కు రవీందర్ పంపిన అరుదైన వుడెన్ టైప్ బటర్ ఫ్లై ఫోటో ఉత్తమ ఫోటోగా ఎంపికై జాతీయ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ పొందారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఎస్సెస్సీ మిత్రబృందం కన్వీనర్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించి మెమెంటో అందించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్సెస్సీ మిత్ర బృందం సభ్యులు వొద్నాల రాజన్న,ఎం.శ్రీనివాస్, చుంచుకాల కిష్టయ్య,రాపర్తి రాములు, గంగారాజు, లక్ష్మీ నర్సయ్య,రవి పాల్గొన్నారు.

## పేరెంట్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

**ప్రజాపక్షం/కొడిమ్యాల:** కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలోని వాసవి హైస్కూల్ ఆధ్వర్యంలో బృందావనం రిసార్ట్‌లో పేరెంట్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్ లక్ష్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.జగిత్యాల అరుణి హాస్పిటల్ పీడియాట్రిషియన్ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ పిల్లల ఆహారంలో పోషకాలు,ప్రోటీన్లు ఉండేలా చూడాలని,జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలని సూచించారు.డిహెచ్‌ఏ ఉన్న ఆహారం తీసుకోవాలని, మొబైల్ అధిక వినియోగం, సీజనల్ వ్యాధులపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.స్పెక్ట్రోపి సిఈఓ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ విజయానికి బలమైన విద్యా పునాది ఎంతో అవసరమన్నారు. చిన్న వయస్సు నుంచే ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ అందించడం ద్వారా గణితం,సైన్స్ వంటి ప్రాథమిక సబ్జెక్టులపై లోతైన అవగాహన, సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యం పెంపొందుతుందని తెలిపారు.. ఐఐటీ లక్ష్యంగా పెట్టుకునే విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే సరైన మార్గదర్శకత్వం,నిరంతర సాధన,క్రమశిక్షణ అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బొడ్డ సతీష్, ప్రిన్సిపాల్ అరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రూ.25.08 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

52 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన జువ్వాడి నర్సింగరావు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మెట్‌పల్లి పట్టణం, మండలంతో పాటు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన నిరుపేదలు,అనారోగ్యంతో బాధపడుతున్న 52 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.25,08,200 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్,మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల సర్పంచులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వైకుంఠ రథం అందించిన మాజీ ఎంపి రంజిత్ రెడ్డి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** మండల కేంద్రంలో గల గ్రామపంచాయతీకి చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి సోదరులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వైకుంఠ రథాన్ని వితరణ చేశారు .జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలో ఎవరైనా చనిపోతే స్మశాన వాటిక స్థలం వరకు వెళ్లడానికి అంతిమ యాత్రకు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మండల కేంద్రానికి చెందిన మాజీ రెడ్డి సంఘం అధ్యక్షుడు పీసు తిరుపతి రెడ్డి వైకుంఠ రథం గురించి రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడగా పుట్టిన ఊరు మీద ప్రేమతో ఆత్మీయ విరాళం గ్రామ అభివృద్ధిలో భాగంగా చనిపోయిన వ్యక్తుల పార్థివదేహాలను వైకుంఠధామం, స్మశాన వాటిక ల వరకు తీసుకెళ్లడానికి వీలుగా మరణించిన వారి తల్లిదండ్రులు గడ్డం చంద్రకళ రాజారెడ్డి ల జ్ఞాపకార్థం వారి కుమారులైన చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి,రిటైర్డ్ ఎస్పి రాజా రవీందర్ రెడ్డి రూ.3 లక్షల వ్యయంతో తయారు చేయించిన స్టీల్ వైకుంఠ రథాన్ని శనివారం గొల్లపల్లి గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామ సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, కుల పెద్దల సమక్షంలో ప్రారంభించి ప్రజల అవసరాల కోసం గ్రామపంచాయతీకి అందజేశారు. ఇతర ప్రాంతాల నుంచి వైకుంఠ రథం తెప్పించడానికి సుమారుగా రూపాయలు మూడు నుంచి ఐదు వేల వరకు ఖర్చు అవుతుందని వివరించారు. చనిపోయిన వారి పార్థివదేహాల అంతిమయాత్రను సురక్షితంగా వైకుంఠ దామం వరకు చేర్చడానికి ఈ వైకుంఠ రథం గొల్లపల్లికి ఎంతగానో ఉపయోగపడనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుచ్చిరెడ్డి, కుల సంఘాల నాయకులు ముస్కు లింగారెడ్డి,భూమయ్య,రమేష్,వెంకటరమణ,లింగారెడ్డి,సంపత్,సత్యనారాయణ,కొమురయ్య, రత్నం,వీరస్వామి,తదితరులు పాల్గొన్నారు.

# పేదోడి బియ్యం అక్రమార్కుల పాలిట వరం



**ప్రజాపక్షం/మల్లాపూర్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెల్ల రేషన్ కార్డు కలిగిన నిరుపేద కుటుంబాలకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కుల పాలిట వరంగా మారింది.ప్రభుత్వం ఒకేసారి లబ్ధిదారులకు మూడు నెలల బియ్యాన్ని పంపిణీ చేయడంతో అక్రమ దందాకు రెక్కలొచ్చినట్లుగానే వ్యవహరిస్తున్నారు.అక్రమార్కులు, గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారని సమాచారం అందుకుని గద్దల వాలిపోతూ లక్షలాది రూపాయల బియ్యాన్ని రాత్రి పగలు తేడా లేకుండా కొనుగోలు చేస్తూ పేదోడు బియ్యాన్ని తన్నుకు పోతున్నారు.ఈ వ్యవహారం అంతా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ మామూళ్ల మత్తులో మునిగిపోయి అక్రమార్కులకు సహకరిస్తుండడంతో వీరి దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పోలీస్ స్టేషన్ ను ఆనుకుని ఉన్న రహదారి నుండే భారీ వాహనాలలో రేషన్ బియ్యం తరలి వెళ్తున్న ,అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్న చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఇంటింటా ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ పోలీసులు,రెవెన్యూ అధికారుల కళ్ల ముందే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న పట్టుకోకపోవడం వీరి పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుంది. అక్రమంగా రేషన్ వ్యాపారం చేసే నిర్వాహకులు నెలనెలా మామూళ్లతో సరిపెడుతుండడంతో ఈ దందా వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. ఏమైనా ప్పటికీ మామూలు ముట్ట చెబితే అక్రమ వ్యాపారాలు కూడా మండలంలో సక్రమమే అనే విధంగా అధికారులు విధులను ఎంతో బాధ్యతారాహిత్యంగా నిర్వహిస్తున్నారంటలో ఆశ్చర్యపోనక్కరలేదు.జిల్లా యంత్రాంగం మండల పై దృష్టి సారిస్తే అక్రమ రేషన్ బియ్యం దందగుట్టు రట్టయ్యే అవకాశం లేకపోలేదు.

# ప్రగతి హై స్కూల్‌లో బోనాల జాతర



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 'ప్రగతి బోనాల జాతర'ను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల సంప్రదాయ వేషధారణలు, జోగిని –పోతురాజుల విన్యాసాలు, నృత్యాలు, కోలాటాలు, నవదుర్గల వేషధారణలతో రాయికల్ పట్టణ పురవీధులలో శోభాయాత్ర నిర్వహించారు.ఈ శోభయాత్ర ప్రగతి ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన శోభాయాత్ర శివాజీ బొమ్మ,పాత బస్టాండ్, మార్కెట్ వీధుల మీదుగా పోచమ్మ దేవాలయం వరకు కొనసాగింది. భక్తిభావాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రగతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, జానపద కళారూపాల గొప్పతనాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్ ,కరస్పాండెంట్ జయశ్రీ, ఉపాధ్యాయ బృందము,విద్యార్థిని,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి మండలం దోనూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ ఇటీవల మంజూరు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను గ్రామ సర్పంచ్ దాసరి పురుషోత్తం ప్రారంభించారు.ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక విద్యను సైతం ప్రాథమిక దశలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు,ఎంఇఓ సీతాలక్ష్మి ,వార్డు సభ్యులు కొత్తపెల్లి ఆశన్న,పాఠశాల హెచ్ఎం కె.స్వప్నప్రియ,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ , మెడికోవర్ హాస్పిటల్స్ సౌజన్యంతో మాజీ సర్పంచ్, కార్యక్రమ ఆర్గనైజర్ సాంబర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.మెడికోవర్ హాస్పిటల్స్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ అన్నారావు నితిన్ పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. సుమారు 1,000 మంది ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కార్యక్రమ ఆర్గనైజర్ సాంబర్ ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లోనూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి ప్రముఖులు గుంటుక విష్ణు,భీమనాథ్ సత్యనారాయణ,జోగ జగదీశ్వర్,గజం రవి,జోగా రాజా, గంగారాం,మల్లాపూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రుద్ర రామ్ ప్రసాద్,గాజంగి సుదర్శన్,పోతు సత్యనారాయణ,జిల్లా వెంకటేశ్వర్లు, గుంటుక సదాశివ్,బండి నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల కుటుంబాలను పరామర్శించిన కొప్పుల

**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పాత్రికేయుడు మాసూరి నాగరాజు మాతృమూర్తి సుశీల అకాల మరణం పట్ల మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపాన్ని వ్యక్తంచేశారు.నాగరాజు నివాసానికి చేరుకున్న కొప్పుల ఈశ్వర్.. సుశీల చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.రాజేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై ఆరా: మండలంలోని రామభద్రునిపల్లికి చెందిన మాజీ సర్పంచ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరుకంటి రాజేశ్వరరావు ఇటీవల గుండె శస్త్రచికిత్స (స్టెంట్) చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం రాజేశ్వరరావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా పూర్తి కోలుకోవాలని ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు గండి పనులు వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని పెద్ద చెరువుకు పడిన గండి పూడ్చే పనుల పురోగతిని బీఆర్ఎస్ నాయకులు శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు చెరువును సందర్శించి, పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇటీవల పెద్ద చెరువుకు గండి పడటంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్ చెరువును పరిశీలించి,గండిని తక్షణమే పూడ్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ మేరకు పనులు కొనసాగుతున్నాయని, సోమవారం నాటికి గండి పూడ్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు బీఆర్ఎస్ నాయకులకు తెలిపారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు అధికారులను కోరారు.

# పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు దోహదం



ప్రజాపక్షం/ఆర్మూర్: అప్పుడే పుట్టిన శిశువుకు తల్లి ముర్రుపాలు మొదటి టీకా అవుతుందని పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు దోహదపడుతాయని ఖానాపూర్ సర్పంచ్ బోదాసు నర్సింలు అన్నారు. శనివారం మండలంలోని ఖానాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించి మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలకు తల్లిదండ్రులు పిల్లలను పంపించాలన్నారు. పిల్లలకు తల్లి పాలు శ్రేష్ఠమని, వారి ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. పిల్లల ఆరోగ్య విషయాలలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అనంతరం తల్లిపాలతో శిశువుకు, తల్లికి కలిగే ప్రయోజనాలను క్లుప్తంగా వివరించారు. ఉప సర్పంచ్ రాజానర్సయ్య, అంగన్‌వాడీ టీచర్లు మమతా ఉమా గంగామణి, రాధిక గంగామణి ఉపాధ్యాయుడు విపుల్ పాల్గొన్నారు.

# ఘనంగా రంగనాథ స్వామి పల్లకిసేవ



ప్రజాపక్షం/బాల్కొండ : మండలంలోని జలాల్పూర్ గ్రామంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయ పూజారి శనివారం ప్రత్యేక పూజలు చేసి నూతనంగా నిర్మించిన పల్లకిలో శ్రీరంగనాథుడు శ్రీదేవి భూదేవి సమేతంగా ఊరేగింపు, గిరి ప్రదక్షిణ చేశారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. నూతన పల్లకి దేవస్థానానికి అందించిన ధాత జక్కు నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్, నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# వందశాతం సర్ కార్యక్రమం పూర్తి చేశాం

తహసీల్దార్ కిరణ్మయి

ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేశామని తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు. తహసీల్దార్ కిరణ్మయి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జక్రాన్ పల్లి మండలంలో సర్ కార్యక్రమం నిర్వహించగా ప్రస్తుతం నాటికి నూరుశాతం పూర్తైందన్నారు. సర్ ప్రోగ్రాం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్ల అప్లికేషన్లు పరిశీలించి తీసుకున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పర్యవేక్షణ చేస్తూ సర్ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. బిఎల్ఓ, బిఎల్ఎ, జిపిఓ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలుపాల్గొన్నారని తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు.

# గాంధారి మైసమ్మ బోనాల జాతరకు సర్వం సిద్ధం



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : గాంధారి మైసమ్మ బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. ఆదివారం నిర్వహించనున్న ఈ జాతరను అంగరంగ వైభవంగా జరిపించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆషాఢ మాసంలో వచ్చే ఈ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిసిపి ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు, నిఘా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# మంత్రి హెచ్చరించినా తలకెక్కని వైనం

## రాంపూర్‌లో అధికారుల అండతో అక్రమార్కుల దందా



ప్రజాపక్షం/చెన్నూరు : కోటపల్లి మండలం రాంపూర్ గ్రామంలో భారీగా అక్రమ ఇసుక నిల్వలు వెలుగుచూశాయి. గ్రామంలో ఇటీవలే ఏర్పాటు చేసిన కరెంట్ స్థంబాల తయారీ కేంద్రం వద్ద పలువురు బిఆర్ఎస్, అధికార పార్టీ నేతల సహకారంతో వందలాది ట్రిప్పుల ఇసుకను నిల్వ చేశారు. కొల్లూరు, దేవులవాడ గ్రామాల సమీపంలో గల గోదావరి నది నుండి రాత్రి వేళల్లో అక్రమంగా ఈ ఇసుకను తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గం లో అక్రమ ఇసుక దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాలు జారీ చేసినా అధికారులు భేఖాతరు చేస్తున్నారు. సొంత శాఖకు చెందిన అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి దందాకు కొమ్ముకాస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కొల్లూరు ఇసుక క్వారీల్లో మిగిలి ఉన్న డంపుల నుండి రాత్రింబవళ్లు తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. గతంలోనే ఈ నిల్వలపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక మంత్రి స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలు పునరావృతం కాకుండా చూసి, నిల్వలను సీజ్ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# చేయూత పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరణ

## రాజంపేట సర్పంచ్ బుర్ర పోచయ్య

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ రూరల్ : రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలో చేయూత సామాజిక భద్రతా పెన్షన్లు, ఆర్థిక సహాయ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుం చి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు గ్రామ పంచాయతీ స ర్పంచ్ బుర్ర పోచయ్య, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వితంతువులు, ఒంటరి మహిళ లు, దివ్యాంగులు, కల్లుగీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ. 4,016, ఇతర అర్హులైన వర్గాలకు రూ. 2,016 చొప్పున ప్రతి నెలా ఆర్థిక సాయం అందనుందన్నారు. అర్హత ఉన్నవారు ఆగస్టు 11 నుండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు స మర్పించాలని సూచించారు. ఆధార్, ఓటర్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఫొటోతో పాటు సంబంధిత పత్రాల జిరాక్స్ ప్రతులు, అసలు పత్రాలు తీసుకురావాలని కోరారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారు కూడా పాత దరఖాస్తుకు బదులుగా కొత్త దరఖాస్తు ఫారం సమర్పించాలని స్పష్టం చేశారు.

# అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

## ఆసిఫాబాద్ డిఎస్‌పి బి. అశోక్



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ రూరల్ : జిల్లా వ్యవసాయ అధికారిని బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఆసిఫాబాద్ డిఎస్‌పి బి. అశోక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ ఎల్‌బి నగర్ కు చెందిన బుతే దేవేందర్, దుప్ప సురేష్ సోషల్ మీడియా జర్నలిస్టుల ముసుగులో జిల్లా వ్యవసాయ అధికారి బోర్కుట్ వెంకటిని బెదిరించి డబ్బులు వసూలు చేశారని పేర్కొన్నారు. రాధిక ట్రేడర్స్ యజమానితో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా దుకాణాన్ని మూసివేయించాలని అధికారిపై ఒత్తిడి తెచ్చారని, రికార్డులు సక్రమంగా ఉన్నాయని తేలడంతో అధికారిపైనే ఒత్తిడి పెంచి డబ్బులు డిమాండ్ చేశారన్నారు. నిందితులు రూ. 20 లక్షలు డిమాండ్ చేసి, జులై 26న రూ. 1.30 లక్షలు నగదుగా తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. అధికారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శుక్రవారం హైదరాబాద్‌లో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. నిందితుల్లో దుప్ప సురేష్ పై గతంలో పోక్సో కేసులో బాధితురాలి వివరాలు సామాజిక మాధ్యమాల్లో వెల్లడించినందుకు కేసు నమోదై ఉందని వెల్లడించారు. కేసును సమగ్రంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తా

## టియుఎస్ జిల్లా అధ్యక్షుడు రామిడి కుమార్

ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ ఉద్యమకారుల సమితి (టియుఎస్) నూతన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రామిడి కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తొడేటి శంకర్ గౌడ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామిడి కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు ప్రభుత్వంపై పోరాటం చేస్తూ సమితి ఆశయాల సాధనకు అంకితభావంతో పనిచేస్తానని వెల్లడించారు.

# ఘనంగా తెలంగాణ బోనాల పండగ



ప్రజాపక్షం/నేరడిగొండ: మండలంలోని బుగ్గారం గురుకుల (బాలికల) పాఠశాలలో ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి, ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు నిర్వహించారు. పురావిధుల గుండా బోనమెత్తుకొని పోచమ్మలకు మొక్కులు తీర్చకొని ఆషాడంలో తెలంగాణ బోనాల పండగ ఆవశ్యకతను పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల హాజరు శాతం ఉండే విధంగా చూడాలి



ప్రజాపక్షం/నేరడిగొండ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా మాధ్యమిక విద్యాధికారి గణేష్ జాదవ్, శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లాస్‌రూమ్‌లో విద్యార్థిని విద్యార్థులతో అధ్యాపకులు బోధించే తీరును అడిగి తెలుసుకున్నారు. శత శాతము హాజరు ఉండాలని ఈ సందర్భంగా అధ్యాపకులు నాన్ టీచింగ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ షబానా తరన్నుం, సూపరింటెండెంట్ షేక్ మోసిన్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# సీహెచ్‌సీలో హెల్త్ మేళా



ప్రజాపక్షం/బాల్కొండ : కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన స్పెషలిస్ట్ హెల్త్ మేళాను జిల్లా వైద్యారోగ్యాధికారిని రాజశ్రీ పరిశీలించారు.హెల్త్ మేళాలో ప్రజలకందుతున్న వైద్య సేవలను, వైద్యులు, సిబ్బంది నిర్వహిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గర్భిణులకు బీపీ పరీక్ష, హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అలాగే గర్భిణులతో స్వయంగా మాట్లాడి పౌష్టికాహారం తీసుకోవాలని ప్రతినెలా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీయంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీందర్, వైద్యులు పల్లవి, వినీషా, దయానందరెడ్డి, సాయి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా కోసం అన్నదాతల పడిగాపులు

## యాప్ తిప్పలతో రైతాంగం అయోమయం

ప్రజాపక్షం/భీమ్‌గల్ : రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రరూపం దాల్చింది. సాగు సీజన్ ముమ్మరమైన వేళ ఎరువుల దుకాణాల ముందు రైతులు తెల్లవారు జాము నుంచే కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిలబడుతున్నారు. గంటల తరబడి వేచి చూసినా కంటి తుడుపుగా ఒకటో రెండో బస్తాలు ఇస్తుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎరువుల కేటాయింపుల కోసం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ యాప్ రైతులకు శాపంగా మారింది. రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించటంలో వ్యవసాయాధికారులు పూర్తిగా అలసత్వం వహిస్తున్నారని, ఏ ఒక్క అధికారి అందుబాటులో ఉండటం లేదని రైతాంగం మండిపడుతోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి నల్లబజారును అరికట్టాలని, యూరియాను అందుబాటులోకి తేవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక గోరింటాకు పండగ



**ప్రజాపక్షం / మందమర్రి :** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మందమర్రి మేదరి బస్తీలో మహిళలు శనివారం గోరింటాకు పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. కాలనీకి చెందిన మహిళలు, యువతులు ఉత్సాహంగా గోరింటాకు పెట్టుకుని పాటలు పాడుతూ సందడి చేశారు. తరాలు మారుతున్నా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలనే సందేశాన్ని ఈ వేడుక చాటి చెప్పింది. ఆషాఢ మాసంలో వాతావరణంలో మార్పుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను నివారించడానికి, శరీరానికి చల్లదనాన్ని ఇచ్చేందుకు గోరింటాకు ఎంతో ఉపయోగపడుతుందని మహిళలు తెలిపారు. చెట్టు ఆకులను రోటిలో దంచి చేతులకు పెట్టుకోవడం నాటి సంప్రదాయానికి ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల లక్ష్మీ దేవి కటాక్షం లభిస్తుందని విశ్వసిస్తామని వెల్లడించారు.

## దొంగతనం జరిగిన తర్వాతే పోలీసుల స్పందన

### అంతకుముందు నిఘా ఏది?

**ప్రజా పక్షం /నర్సాపూర్ :** జినర్సాపూర్(జి) మండలంలో దొంగతనాల ఘటనలపై పోలీస్ శాఖ స్పందిస్తున్నప్పటికీ, దొంగతనం జరిగిన తర్వాతే పోలీసులు రంగంలోకి దిగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగిన తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం మాత్రమే కాకుండా, ఘటన జరగక ముందే నిఘా పెట్టి అడ్డుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది."దొంగతనం జరిగే వరకు పోలీసులు ఏం చేస్తున్నారు? దొంగలు దొంగతనం చేసిన తర్వాతే మేల్కొంటారా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముందస్తు నిఘా, రాత్రి గస్తీ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు.

## ఎల్‌నినో ప్రభావం వల్ల ఆరుతడి పంటలు వెయ్యాలి

**ప్రజా పక్షం /దిలావర్ పూర్ :** సూపర్ ఎల్లినో ప్రభావంతో ఆగస్టు 15 తేదీ నుంచి ఆశించినటువంటి వర్షాలు లేవని ఐఎండి శాఖ తెలియజేయడం మూలంగా శనివారం వ్యవసాయ ఉద్యానవన నీటిపారుదల మరియు పంచాయతీరాజ్ శాఖల సంయుక్తంగా సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి ఖచ్చితమైనటువంటి నీటి వనరులు ఉంటే తప్ప వరి తక్కువ చేసుకోవాలని ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు విత్తుకోవాలని,ఆయిల్ పామ్ పంట యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ పంట విస్తీర్ణాన్ని రెట్టింపు చేయాలని అలాగేఈనెల 13వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించబోతున్న ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ పైన రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. పలు గ్రామాలలో గ్రామసభలు దిలావర్ పూర్,మాడేగాం, మాయాపూర్, సిర్గాపూర్, బన్సపల్లి,కాల్వ మరియు కాల్వ తాండాలో నిర్వహించడం జరిగింది.మాయాపూర్ గ్రామంలో కళా జాతర బృందం వారు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తేజస్విని,జైపాల్ శ్రీనివాస్ గౌడ్,ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ జిల్లా రాజంపేట గ్రామపంచాయతీలో మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ సహకారంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మ్యాక్సివిజన్ వైద్య బృందం గ్రామస్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. కంటి సమస్యలతో బాధపడుతూ శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. వృద్ధులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై సేవలను వినియోగించుకున్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్సా పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది సంతోష్, పోషన్నా, మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ వైద్య బృందం, బిసి యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు బొట్టుపెల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

### సిఐటియు జిల్లా సంయుక్త కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు ఆసిఫాబాద్ జిల్లా సంయుక్త కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జైల్ భరో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, పంటలకు మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. ఈ నెల 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమానికి కార్మికులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకురాళ్లు శ్రీలత, శిరీష, వెంకటి పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల పండుగ సంబురాలు



**ప్రజాపక్షం/తానూర్ :** మండల కేంద్రంలో తానూర్ పాఠశాలలో బోనాల పండుగ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బోనాల పండుగ ప్రాముఖ్యత,తెలంగాణ సంస్కృతి మరియు సంప్రదాయాల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తెలంగాణ జానపద గీతాలు, నృత్యాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాలోడ్ సాయి బాబు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని, మన పండుగల విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.సీనియర్ టీచర్ నరేందర్ కుమార్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని,ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి పట్ల గౌరవం మరియు అవగాహన పెంపొందుతుందని తెలిపారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిర్మల్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పండుగ సాయన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్ పేట్ లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 'తెలంగాణ బందూక్',బడుగు బలహీన వర్గాల నాయకుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.నిర్మల్ పట్టణ,బంగాల్ పేట్,నాయుడు వాడ ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో, జిల్లా నాయకులు పాతర్ల హరీష్ ముదిరాజ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు యాటకరి సాయన్న ముదిరాజ్, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు రామగిరి రవీందర్ మహారాజ్, కల్లూరు సుధాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు బిజెపి పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి ముదిరాజ్ హాజరై పండుగ సాయన్న సేవలను గుర్తు చేసుకున్నారు. 1840 ఆగస్టు 8న జన్మించిన పండుగ సాయన్న పేదలకు అండగా నిలిచిన గొప్ప బహుజన వీరుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు,ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ప్రెస్ భవనానికి ప్రహరీ గోడ నిధులకు వినతి



**ప్రజాపక్షం / జన్నారం :** ప్రెస్ క్లబ్ భవనానికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్ కోరారు. శనివారం ఉట్నూర్ లోని ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎంఎల్‌ఏ వెడ్మ బొజ్జు పటేల్ ను ప్రెస్ క్లబ్ నాయకులు కలసి వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలోని ప్రెస్ భవనానికి ప్రహరీ లేకపోవడంతో భద్రత కొరవడిందని వివరించారు. నిధులు మంజూరు చేసి వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎంబడి మల్లేశం, ప్రధాన కార్యదర్శి జాడి వెంకటయ్య పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న అడవి పందులు

**ప్రజాపక్షం / కౌటాల :** ద్విచక్రవాహనానికి అడవి పందులు అడ్డు రావడంతో దంపతులు కిందపడి గాయపడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కౌటాల మండలం ముత్తంపేట గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కౌటాలకు చెందిన నాగేష్, తన భార్యతో కలిసి సిర్పూర్ హాస్టల్లో చదువుకుంటున్న పిల్లలను చూసేందుకు వెళ్తుండగా రోడ్డుపైకి ఒక్కసారిగా అడవి పందులు వచ్చాయి. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న బిఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రమాదాన్ని గమనించి తన వాహనం ఆపి బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించిన ప్రవీణ్ కుమార్ కు బాధితులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## సెలవు ప్రకటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### టివియువి రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** రెండో శనివారం సెలవు పాటించని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేస్తూ శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలు రెండో శనివారం సెలవు దినం పాటించకుండా తరగతులు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలను ప్రైవేటు యాజమాన్యాలు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి పాఠశాలలు నడిపిన యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## నూతన రోడ్డుపై కెజి వీల్స్ వాహనాలు రావద్దు

**ప్రజాపక్షం / రెబ్బెన :** నూతనంగా నిర్మించిన రోడ్డును పరిరక్షించుకునేందుకు కేజీ వీల్స్ వాహనాలు రాకూడదని పైకాజిగూడ గ్రామ యువకులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నారాయణపూర్ నుండి పైకాజిగూడ వరకు 4.5 కిలోమీటర్ల మేర నూతన రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈ నేపథ్యంలో గ్రామ యువకులు రోడ్డు ప్రారంభ స్థానంలో శుక్రవారం హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సరైన భద్రత లేకుండా కేజీ వీల్స్ ట్రాక్టర్లతో నూతన రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ నిధులతో వేసిన రోడ్డును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నా రు. భారీ వాహనాలు, కేజీ వీల్స్ తిరగడం వల్ల రోడ్డు త్వరగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రెబ్బెన పోలీసులు కూడా మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పైకాజిగూడ గ్రామ యువకులు పాల్గొన్నారు.

## రాజుర ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగ



ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలం లోని రాజుర ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ మాట్లాడుతూ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించడం జరిగిందని బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలపడం జరిగిందని విద్యార్థులు,భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి సాంస్కృతికంగా పోతరాజుల విన్యాసాలు మరియు అమ్మవారి వేషధారణలో నృత్యాలు చేసి అలరించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల,ముత్త గౌడ్,సాయి,ప్రసాద్,సరస్వతి,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సర్పంచుల సంఘం కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లా సర్పంచుల సంఘం కార్యవర్గాన్ని శనివారం తెలంగాణ పంచాయితీ సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు భూమన్న యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా నర్సపూర్ (జి) సర్పంచ్ గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి,గౌరవ అధ్యక్షులుగా కుంటాల సర్పంచ్ జక్కుల గజేందర్, ప్రధాన కార్యదర్శిగా ఆవర్గా సర్పంచ్ కదం భుజంగరావు,ఉపాధ్యక్షులుగా నవీన్ యాదవ్, వడ్నాల వెంకట్, సుష్మా రెడ్డి, భూమన్న, పెంట దశరథ, కార్యదర్శిలుగా లలితా రాజేష్, చిట్యాల లక్ష్మి ,సంయుక్త కార్యదర్శిగా ఏంపల్లి నాగ లక్ష్మి లను ఎన్నుకున్నారు.

## రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై జైల్ భరో

### భైంసాలో పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాపక్షం/భైంసా : కేంద్ర ప్రభుత్వ రైతు,కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్మల్‌లో చేపట్టనున్న జైల్ భరో పోస్టర్లను సంయుక్త కిసాన్ మోర్చా, ఆధ్వర్యంలో భైంసా మార్కెట్ యార్డ్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు దుర్గం నూతన్ కుమార్,జే రాజు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని,ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, విదేశీ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26,000 చెల్లించాలన్నారు.అలాగే ఉచిత విద్యుత్ హక్కులను దెబ్బతీసే విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని,అర్హులైన పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వి. మహేందర్, డాకూర్ తిరుపతి,గంగాధర్,ఇప్ప లక్ష్మన్,పాల్గొన్నారు.

## జిపిఎస్ సాయినగర్ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ టీమ్ తనిఖీ

### విద్యార్థుల్లో ప్రాథమిక సామర్థ్యాల సాధనే లక్ష్యం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాలు మెరుగుపరిచే లక్ష్యంతో సెల్ ఆధ్వర్యంలో సాయినగర్ (ఉర్దూ మీడియం తెలుగు మీడియం) పాఠశాలల్లో సందర్శన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ బృందం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించింది. విద్యార్థుల అభ్యసన స్థాయిలను అంచనా వేసి, వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక శ్రద్ధతో అదనపు అభ్యసన సహాయం అందించాలని ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు జారీ చేసింది.పాఠశాలలో అందుబాటులో ఉన్న వర్క్‌బుక్స్, బోధనా అభ్యసన సామగ్రి విద్యా వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ కార్యకలాప ఆధారిత బోధనా పద్ధతులను అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన తరగతి స్థాయికి అనుగుణంగా నిర్దేశించిన సామర్థ్యాలను సాధించేలా నిరంతర మూల్యాంకనం, పునశ్చరణ మరియు వ్యక్తిగత శ్రద్ధకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ దర్శనం భోజన్న మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలలో ప్రావీణ్యం సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ,అకడమిక్ సపోర్ట్ అందించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి నిపుణ్ భారత్ మిషన్ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి నరసయ్య, ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఖలీద్, సుమలత,సీఆర్‌పీ ఫిరోజ్,తదితరులు పాల్గొన్నారు.

## పెండల్‌దారి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలి!

### టిఎజి ఎస్ జిల్లా కార్యదర్శి తోడసం శంభు.!



ప్రజాపక్షం/సారంగాపూర్ : పెండల్దరి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించి లింగాపూర్ పెండల్దరి 2 కిలోమీటర్ల రహదారిని వెంటనే మంజూరు చేయాలని TAGS జిల్లా కార్యదర్శి తొడసం శంభు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మండలంలోని పెండల్‌దారి గ్రామంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం గ్రామ అధ్యక్షులు ఆత్రం నాగోరావు అధ్యక్షతన,జరిగినఈ కార్యక్రమానికి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం శంభు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఆదివాసీ గ్రామాల్లో అటవీ అధికారుల వేధింపులను వెంటనే నిలిపివేయాలని,గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లింగాపూర్ నుండి పెండల్‌దారి వరకు సుమారు 2 కిలోమీటర్ల రహదారిని వెంటనే మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. అలాగే పెండల్‌దారి గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ మంజూరై ఉన్నందున, వెంటనే విద్యుత్ స్తంభాలు తీసుకువచ్చి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గ్రామాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నామని తొడసం శంభు తెలిపారు.లింగాపూర్ నుండి పెండల్‌దారి వరకు 2 కిలోమీటర్ల రహదారిని వెంటనే మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ సమస్యలపై తక్షణమే స్పందించకపోతే భవిష్యత్తులో చుట్టుపక్కల గ్రామాల ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున నిరసనలు,దీక్షలు చేపడతామని హెచ్చరించారు.ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీడం గంగారాం,సీడం భీంరావ్, మహేష్, దురువ దేవరావు,జంగు,గణేష్,తదితరులు,గ్రామస్థులు పాల్గొన్నారు

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి

ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ : రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న దళారులు,అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ డిమాండ్ చేశారు.అధికారుల నిర్లక్ష్యం, పటిష్ఠ నిఘా లేకనే పేదల బియ్యం భారీగా అక్రమంగా తరలుతోందని శనివారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు.ఖానాపూర్ పట్టణ,మండల పరిధిలోని గ్రామాల్లో ఏదో ఓ చోట రేషన్ బియ్యం పట్టుబడుతూనే ఉందని,అధికారులు మాత్రం ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆయన ఆరోపించారు.ఇటీవల ఖానాపూర్ పట్టణంలో 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం వాహనంలో పట్టుబడగా మండలంలో దందా సాగిస్తున్న అక్రమార్కులు, తప్పించుకుంటూ తిరుగుతున్న వాహనాలను అధికారులు ఎందుకు పట్టుకోలేకపోతున్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.పేదల బియ్యం అక్రమ రవాణాలో అసలు సూత్రధారులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై సంబంధిత అధికారులు, పౌరసరఫరాల శాఖ,రెవెన్యూ అధికారులు పోలీసులు సమన్వయంతో ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేపట్టాలని ఆయన కోరారు.



## 10న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌టీసీ టీఎంయూ విస్తృత స్థాయి సమావేశం

### రీజినల్ కార్యదర్శి ఆర్. గంగాధర్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని ఈ నెల 10న (సోమవారం) నిర్వహించనున్నట్లు ఆర్‌టీసీ టీఎంయూ ఆదిలాబాద్ రీజినల్ కార్యదర్శి ఆర్. గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ,యూనియన్ భవిష్యత్తు కార్యాచరణ లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన టీఎంయూ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు, యూనియన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అనంతరం రీజియన్ స్థాయి ఎన్నికల సమావేశం జరుగుతుందని,ఇందులో ముమ్మందు చేపట్టబోయే కార్మిక పోరాటాలు, సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్,ఉట్నూర్,మంచిర్యాల,నిర్మల్, భైంసా 6 డిపోలకు చెందిన టీఎంయూ నాయకులు, కార్యకర్తలు, ఆర్‌టీసీ కార్మికులు హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని గంగాధర్ పిలుపునిచ్చారు.

## కొమురం భీమ్ చౌరస్తాలో చీకట్లు సమస్య పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్ కృషి



ప్రజా పక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని కొమురం భీమ్ చౌరస్తా వద్ద ఉన్న సెంట్రల్ లైటింగ్ గత మూడు రోజులుగా పనిచేయకపోవడంతో రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యపై స్పందించిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ శుక్రవారం మున్సిపాలిటీ విద్యుత్ సిబ్బందితో లైటింగ్‌ను పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టించారు.అయితే లైట్ల మరమ్మతులకు అవసరమైన సామగ్రి మున్సిపాలిటీలో అందుబాటులో లేకపోవడంతో సంబంధిత ఆర్‌అండ్‌బీ రోడ్డు అధికారులతో చైర్మన్ మాట్లాడారు. చౌరస్తాలోని విద్యుత్ లైట్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులను కోరారు.సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో త్వరలోనే కొమురం భీమ్ చౌరస్తాలో వెలుగులు పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్,మున్సిపాలిటీ విద్యుత్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## అణగారి వర్గాల ఆకలి తీర్చిన పండగ సాయన్న చేసిన సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/తానూర్ : అణగారిన వర్గాల ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న చేసిన సేవలు మరువలేవని, ముదిరాజ్ సంఘం సభ్యులు అన్నారు.శనివారం తానూర్ మండల కేంద్రంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను సంఘం సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలవబడే పండుగ సాయన్న నిజాం నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆనాడు నిజాం ప్రభువుల ధాన్యం కారాగాన్ని కొల్లగొట్టి వాటిని పేదలకు పంచి పెట్టేవాడు అన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘాం సభ్యులు గ్రామస్తులు,పాల్గొన్నారు.

## మహాలక్ష్మి ఆలయంలో వైభవంగా బోనాల వేడుకలు

### డాక్టర్ నాళం స్వప్న శశికాంత్ దంపతులకు ఘన సన్మానం

ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా బోనాల పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా,ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి.ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ నాళం స్వప్న శశికాంత్ దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు సమర్పించారు. నిర్మల్ ప్రాంత ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.పూజా కార్యక్రమాల అనంతరం, ఆలయానికి విచ్చేసిన డాక్టర్ నాళం స్వప్న శశికాంత్ గార్లను ఆలయ అధికారులు, అర్చకులు శాలువాతో కప్పి,ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. పట్టణ ప్రజలు,భక్తులు విశేషంగా పాల్గొన్న ఈ బోనాల ఉత్సవంతో నిర్మల్‌లో భక్తి పారవశ్యం నెలకొంది.



## పదవి కేటాయించాలని అధిష్టానానికి విజ్ఞప్తి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ముత్యంపేట వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా తనకు స్థానం కల్పించాలని రాఘవపేట గ్రామానికి చెందిన యేట్టం మల్లేష్ యాదవ్అధిష్టానాన్ని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడుగా కల్వకుంట్ల సుజిత్ రావు నేతృత్వంలో పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశానని పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి అధిష్ఠానం చైర్మన్గా అవకాశం కల్పించాలని కోరారు. కాగా మల్లేష్ యాదవ్కు జగిత్యాల యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉన్నందున పదవి కేటాయిస్తే యాదవులతో పాటు రైతులకు న్యాయం జరుగుతుందని పలువురు యాదవ కులస్తులు,కాంగ్రెస్ నాయకులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్:** జగిత్యాల అర్బన్ మండలం అంబారీపేట గ్రామంలో మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్ వారిచే గ్రామ సర్పంచ్ గిరిసెల గంగాధర్,ఉపసర్పంచ్ భూదేవి గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగినది.డాక్టర్ దాదాపుగా 80 మందిని చూసి వారికి బిపి టెస్ట్,షుగర్,ఈసిజి,పలు రక్త పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు,గుర్రం కిరణ్,కర్ణాకర్,సురేష్,సిబ్బంది, అంబారీపేట గ్రామ పంచాయతి పాలకవర్గం,గ్రామ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/పెగడపల్లి:** మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో పలు కారణాలతో మరణించిన కోరే రామయ్య, బండారి పోచయ్య, ఇస్లావత్ లాలా నాయక్ కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ విషయాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి, ఆయా కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కదారి తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్,పార్టీ సీనియర్ నాయకులు ఒరుగల శ్రీనివాస్, సంధి మల్లారెడ్డి, పూసాల తిరుపతి, సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్, ఉపసర్పంచ్ మహేందర్ పాల్గొన్నారు. అలాగే డైరెక్టర్లు చాట్ల విజయ భాస్కర్,లింగంపల్లి మహేష్, చెట్ల కిషన్, అంజి నాయక్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రవి నాయక్,నాయకులు రాజేందర్ రెడ్డి, శ్రీను,నరేష్,తిరుపతి, శేకర్, రాజేష్ నాయక్,స్వామి,అశోక్,శ్రీనివాస్, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..మాల సంఘం నాయకులు

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గుంజపడుగు గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం వివాహిత దళిత మహిళపై జరిగిన ఘటనపై మాల సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు.బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వారికి ఎలాంటి భయాందోళనలు కలగకుండా ధైర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మాల సంఘం నాయకులు స్పష్టం చేశారు. అరాచకాలకు వ్యతిరేకంగా గ్రామ,మండల,జిల్లా స్థాయిలో ఐక్యంగా పోరాటం చేస్తామని తెలిపారు.బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆమె కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ ఘటన పై ఇప్పటికే నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసిన నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయాలని కోరారు. నిందితుడిని చట్టప్రకారం వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.బాధితురాలు,ఆమె కుటుంబ సభ్యులకు అవసరమైన రక్షణ కల్పించాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల సంఘం నాయకులు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఈసీ మెంబర్ నల్ల శ్యాం,మాల సంఘాల మండల జేఏసీ కన్వీనర్ కదారి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జనుప వెంకటేష్,మండల అధ్యక్షుడు పొనగంటి రాజారత్నం,మాజీ అధ్యక్షుడు మ్యాధరి రమేష్, మండల ఉపాధ్యక్షుడు బుపతి,సలహాదారులు జనుప లచ్చన్న, గ్రామ మాలపెద్దలు,తదితరులు పాల్గొన్నారు.



## ఆమె కళ్ళు సజీవం

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన ఆవునూరి లావణ్య (21) రోడ్డు ప్రమాదంలో మరణించినా ఆమె కళ్ళు సజీవంగా ఉన్నాయి.మరణించిన తమ బిడ్డ కళ్ళు సజీవంగా ఉండి మరో ఇద్దరికి చూపును ఇవ్వాలని కుటుంబ సభ్యులు భావించి నేత్ర దానం చేశారు.వివరాలు ఇలా ఉన్నాయి.కమలాపూర్ గ్రామానికి చెందిన ఆవునూరి లక్ష్మణ్ గంగ దంపతుల కూతురు లావణ్య గత గురువారం ధర్మపురి మండలం తిమ్మాపూర్ శివారులోని హనుమాన్ గండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా జగిత్యాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. లావణ్య గత రెండు రోజుల నుండి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించింది.రోడ్డు ప్రమాదంలో మరణించిన లావణ్య కళ్ళు దానం చేసి మరో ఇద్దరికి చూపును ఇవ్వాలని భావించిన ఆమె తల్లి గంగ,సోదరులు ఆవునూరి మహేష్,శ్రీనివాస్,ప్రదీప్ లు లావణ్య కళ్లను హైదరాబాద్ లోని ఎల్వి ప్రసాద్ ఆసుపత్రికి దానం చేశారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎస్సై మిర్యాల రవీందర్ కుమార్,హెడ్ కానిస్టేబుల్ రామస్వామి, ఫోరెన్సిక్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చెన్నోజి రాజేంద్రప్రసాద్,ఆవునూరు మల్లేష్,చిట్యాల నరేష్ పాల్గొన్నారు.



## టిజిఎఫ్ఎస్ఎల్లో శాస్త్రీయ అధికారిగా ఎంపికైన హరీష్కు సన్మానం

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** తెలంగాణ పోలీసు శాఖ నేర పరిశోధన విభాగం ఫోరెన్సిక్ ల్యాబ్ లో (టీజీఎఫ్ఎస్ఎల్)లో శాస్త్రీయ అధికారిగా ఎంపికైన గొల్లపల్లి మండలం కేంద్రానికి చెందిన డా. చెవులమద్ది హరీష్ను పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు అంకం రవి మాట్లాడుతూ నేటి యువత డా. హరీష్ను స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని హరీష్ సాధించిన విజయం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం యూత్ ప్రధాన కార్యదర్శి అంకం సతీష్, ఉపాధ్యక్షులు ఎనగందుల సాయికృష్ణ, పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి చౌటపెల్లి తిరుపతి (బట్టల), సహాయ కార్యదర్శి చౌటపల్లి రఘునందం, చౌటపెల్లి తిరుపతి, ఎల్లె రాజు, యూత్ సభ్యులు అంకం గణేష్, అంకం రాజు,అంకం అరుణ్,చౌటపెల్లి రమేష్, ఆడెపు సంజీవ్,అడ్వకేట్ చిర్ర దిలీప్,తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్లో ఐపిఎస్ విద్యార్థి సత్తా

### స్టాండింగ్ లాంగ్జంప్లో మోహన్స్రావుకు కాంస్యం

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపిఎస్) విద్యార్థి జె. మోహన్స్రావు ప్రతిభ చాటాడు. హనుమకొండలో తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ తెలంగాణ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్లో అండర్6 బాలుర స్టాండింగ్ లాంగ్జంప్ విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పోటీపడి మోహన్స్రావు పతకం సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయిలో పతకం సాధించిన మోహన్స్రావును పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు.క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వారికి నాణ్యమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.క్రమశిక్షణ, సాధనతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మోహన్స్రావుకు శుభాకాంక్షలు తెలిపారు.మోహన్స్రావుకు శిక్షణ అందించిన కోచ్ సత్యనారాయణను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. విద్యార్థి విజయానికి కృషి చేసిన కోచ్ సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత,మేనేజర్ శివ, పీఈటీలు సతీష్,జ్యోతి,తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.



## మారుతి బ్రీజా నూతన మోడల్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మెట్పల్లి:** మెట్పల్లి పట్టణంలోని మారుతి నగర్లో గల మారుతి సుజుకి కార్ షోరూంలో నూతన మారుతి బ్రీజా టర్బో ఇంజిన్ 1000సీసీ కారును శనివారం ఘనంగా ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు,మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి షోరూం యాజమాన్యంతో కలిసి నూతన కారును ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, శక్తివంతమైన టర్బో ఇంజిన్తో రూపొందించిన నూతన మోడల్ కారు వినియోగదారులను ఆకట్టుకుంటుందని అన్నారు. మార్కెట్లో ఈ మోడల్ మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. మెట్పల్లి,పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న షోరూం యాజమాన్యాన్ని అభినందించారు.కార్యక్రమంలో మెట్పల్లి, కోరుట్ల పట్టణాలకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,షోరూం నిర్వాహకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ వుడ్ హైస్కూల్లో బోనాల జాతర



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండల కేంద్రంలోని శ్రీ గ్రీన్ వుడ్ హై స్కూల్ లో ఆషాడ మాస బోనాలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన కూడలిల వద్ద విద్యార్థిని,విద్యార్థు లు సాంస్కృతిక కార్యక్రమాలు పోతరాజుల విన్యాసాలు,పెద్దపులి విన్యాసాలు అలరించాయి.కరస్పాండెంట్ మహేష్ రెడ్డి మాట్లాడుతూ ఆషాడ మాసంలో వచ్చే బోనాలు తెలంగాణకు తరతరాలుగా వస్తున్న సాంప్రదాయమని,టెక్నాలజీ ఎంత పెరిగిన సంస్కృతి సాంప్రదాయాలు తెలంగాణకు పట్టుకొమ్మలుగా ఉన్నాయని,భారత సంస్కృతిలో హిందూ సాంప్రదాయం ఒక ప్రత్యేకమైనదని అన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కాకర శ్రీనివాస్ రెడ్డి,హెడ్మాస్టర్ రాజేష్,విద్యార్థులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రెమెడియేషన్ అమలును పరిశీలించిన ఎఫ్ఎల్ఎన్ మానిటరింగ్ బృందం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ స్కూల్, మండలంలోని కోజన్ కొత్తూరు మండల పరిషత్ హై స్కూల్ పాఠశాలలను జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ మానిటరింగ్ బృందం శనివారం సందర్శించారు . అనంతరం రెమెడియేషన్ కార్యక్రమం అమలును పరిశీలించింది.విద్యార్థుల అభ్యసన స్థాయిని,సబ్జెక్టుల వారీగా సాధించాల్సిన సామర్థ్యాలను పరిశీలించి,లోపాలను గుర్తించి వాటిని అధిగమించేలా రెమెడియేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని బృందం పేర్కొంది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభారాణి,వాణి, డి ఆర్ పి లు విజయ్ కుమార్,ప్రవీణ్ కుమార్ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శ

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలం వస్పాపూర్ గ్రామానికి చెందిన బత్తుల మల్లన్న ఇటీవల మరణించాడు. ఆయన కుటుంబ సభ్యులను శనివారం మాజీ మంత్రి,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం స్ఫూర్తితో అటవీ ప్రాంత పరిరక్షణకు అంకితమైన వ్యక్తి బత్తుల మల్లన్న అని,తెలంగాణ ఉద్యమకారుడని,మాజీ ముఖ్యమంత్రి ప్రారంభించిన హరితహారం కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని, పర్యావరణ పరిరక్షణతో పాటు అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు మల్లన్న చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేతను అరికట్టడంతో పాటు, కొత్త మొక్కలను నాటడం, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం,ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు స్థానికులను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలను చాలా చేశారని గుర్తు చేశారు.అలాంటి మల్లన్న మరణం చాలా బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కటుకం రవిందర్, నాయకులు గోపి రాజిరెడ్డి,బర్కం మల్లేష్,మహిపాల్,శ్రీధర్ రెడ్డి,హరీష్ రావు,సుధీర్, రవి,బొమ్మేన తిరుపతి, రొండి గంగారాం,దుంపేట బుచ్చన్న ,ముజాహిద్, కొత్తూరి రాకేష్ ,అంజాద్,మహేష్,రవి,నందు నాయక్, తదితరులు పాల్గొన్నారు.